క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నిడమనూరు : మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో బంకాపురం ఫీడర్‌కు సంబంధించిన గ్రామాలకు బుధవారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ శరత్‌కుమార్ మంగళవారం తెలిపారు. బంకాపురం ఫీడర్‌లోని బంకాపురం, వెనిగండ్ల, రాజన్నగూడెం, మార్లగడ్డ గ్రామాలకు వెళ్లే విద్యుత్ లేన్ల మధ్య కొన్ని స్తంభాలు, వైర్లు ఏర్పాటు చేస్తున్నందున విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, అందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

మిర్యాలగూడ మున్సిపల్ కమిషనర్‌గా జి.శ్రీనివాస్

మిర్యాలగూడ టౌన్ : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ గ్రేడ్–2 మున్సిపాలిటీలో జాయింట్ కమిషనర్, మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న జి.శ్రీనివాస్‌ను గ్రేడ్–1 మిర్యాలగూడ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ మున్సిపల్ సెక్రటరి డాక్టర్ టీకే శ్రీదేవి సోమవారం రాత్రి ఉత్తర్వులను జారీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్‌కు ఇంకా ఎలాంటి ఉత్తర్వులు అందలేదు. మున్సిపల్ కమిషనర్‌గా వస్తున్న శ్రీనివాస్ రెండు, మూడు రోజుల్లో బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం.

నందికొండ మున్సిపల్ కమిషనర్‌గా వెంకట్రామిరెడ్డి

నాగార్జునసాగర్ : నందికొండ మున్సిపాలిటీ కమిషనర్‌గా జి.వెంకట్‌రామిరెడ్డి బదిలీపై వచ్చారు. ఆయన తెలంగాణ సెక్రటరేట్‌లో ఏఎస్‌ఓగా పనిచేస్తూ ప్రమోషన్‌పై నందికొండకు వచ్చారు. ఇక్కడ కమిషనర్‌గా పనిచేసిన శ్రీనివాస్ ప్రమోషన్‌పై చిట్యాలకు వెళ్లారు.

ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని వినతి

మిర్యాలగూడ టౌన్ : ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని మంగళవారం హైదరాబాద్‌లో స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నవీన్‌నికోలస్‌కు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. పుస్తకాలు, యూనిఫాం, బెల్ట్, టై వంటి వాటి పేరుతో మరో దోపిడీ చేస్తున్నారని, ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేయడంతో విద్యార్థుల తల్లిదండ్రులకు భారంగా మారిందన్నారు. ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలన్నారు.

ఘనంగా బ్యాంకు డే వేడుకలు



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న నల్లగొండ రీజినల్ మేనేజర్ శివకృష్ణ

దేవరకొండ : పట్టణంలో70వ బ్యాంకు డే వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లగొండ రీజినల్ మేనేజర్ శివకృష్ణ మాట్లాడారు. 70సంవత్సరాలుగా ఖాతాదారులకు సేవలు అందించడంలో బ్యాంకుల పాత్ర కీలకం అన్నారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రవిప్రకాష్, ఎస్‌బీఐ ఎస్‌యూహెచ్‌సీ ఓటీసీ వెల్ఫేర్ అసోసియేటెడ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్‌వీటీ, ఫణీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు

నిడమనూరు : అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం అన్నారు. మంగళవారం మండలంలోని మార్లగడ్డలో ఇందిరమ్మ ఇంటి మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందించి పనులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొండా శ్రీనివాస్‌రెడ్డి, ముంగి శివమారయ్య, పంచాయతీ కార్యదర్శి సతీష్, ఉమ్మడి ఆనంద్, ఉమ్మడి వల్లభరెడ్డి, మార్కెట్ డైరెక్టర్ శ్రీను, నగేష్, ప్రతాప్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

దేవరకొండ : విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందింది. ఈ ఘటన చందంపేట మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జబ్బు తిరుపతయ్య తన గేదెను మేతకు విడిచిపెట్టగా మేసుకుంటూ వెళ్లి సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం వెనుక తెగిపడి ఉన్న విద్యుత్ తీగలు తగిలి మృతి చెందింది. మృతి చెందిన గేదె విలువ రూ.60వేలు ఉంటుందని బాధితుడు వాపోయాడు.

ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

కొండమల్లేపల్లి : జూలై 7న నిర్వహించే ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్‌మాదిగ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు పోలేని యాదయ్య, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఎదుళ్ల ఎల్లయ్యమాదిగ, వస్కుల ఇద్దయ్యమాదిగ, అందుగుల జానయ్యమాదిగ, బాలకృష్ణ, సైదులు, శ్రీను, వెంకటేష్ పాల్గొన్నారు.

అసంపూర్తి గదుల్లో పాఠాలు



గుర్రంపోడు ప్రాథమిక పాఠశాలలో అసంపూర్తిగా భవన నిర్మాణం



కట్టవారిగూడెం ప్రాథమిక పాఠశాలలో అసంపూర్తి నిర్మాణంలో ఉన్న తరగతి గది

- నిలిచిన మన ఊరు–మన బడి పనులు
- కాంట్రాక్టర్లకు బిల్లులు అందక రెండేళ్లుగా ముందుకుసాగని తరగతి గదుల నిర్మాణం
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

గుర్రంపోడు : గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు ఉన్నత విద్యా బోధన అందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం ‘మన ఊరు – మన బడి’ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ పథకంలో భాగంగా శిథిలావస్థలో ఉన్న పాఠశాలల భవనాలను తొలగించి నూతన భవనాల నిర్మాణాలతో పాటు పాఠశాలల్లో విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, ప్రహరీ నిర్మాణాలను చేపట్టాల్సి ఉంటుంది. ఇందులో భాగంగానే మండల కేంద్రంమైన గుర్రంపోడు ప్రాథమిక పాఠశాలతో పాటు కట్టవారిగూడెం, చామలేడు, పిట్టలగూడెం, పోచంపల్లి తదితర గ్రామాల్లోని పాఠశాలల్లో చేపట్టిన పనులు అసంపూర్తిగా నిలిచి పాఠశాలల నిర్వహణలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గుర్రంపోడు ప్రాథమిక పాఠశాల భవనాన్ని కూల్చివేసి నూతన భవన నిర్మాణానికి పనులు ప్రారంభించారు. స్లాబ్ వరకు పనులు జరిపించినా కాంట్రాక్టర్లకు ఇప్పటికీ ఒక్క రూపాయి బిల్లు చెల్లించకపోవడంతో పనులు మధ్యలోనే నిలిపివేశారు. ఇంతలో ప్రభుత్వం మారడంతో ఈ పథకాన్ని పక్కకు పెట్టడంతో అప్పటి వరకు చేపట్టిన పనుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కట్టవారిగూడెం ప్రాథమిక పాఠశాలలోనూ ఉన్న భవనాన్ని కూల్చి వేసి నూతన భవనానికి స్లాబ్ వేసి పనులు నిలిపివేశారు. పిట్టలగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో డైనింగ్ హాల్, ఇతర పనులు అసంపూర్తిగా నిలిచాయి.

అసంపూర్తిగానే నిర్మాణాలు..

పాఠశాలల్లో అసంపూర్తి తరగతి గదుల్లోనే పాఠాలు బోధించాల్సి వస్తుండడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. బడి బాట కార్యక్రమంలో గ్రామ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని ఇంటింటికి తిరుగుతున్న టీచర్లను మీ బడికి పంపిస్తే మా పిల్లలను ఎక్కడ కూర్చోబెడతారని ప్రశ్నిస్తున్నారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా ప్రయత్నిస్తున్న ఉపాధ్యాయులకు ఈ అసంపూర్తి నిర్మాణాలు అడ్డంకులుగా మారుతున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం మన ఊరి మన బడిలో చేపట్టిన పనులకు బిల్లులు ఇవ్వడం లేదని పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు వాపోతున్నారు. కాగా ఈ విషయమై సంబంధిత ఇంజనీరింగ్ అధికారి రవికుమార్‌ను ప్రశ్నించగా ఇప్పటి వరకు జరిగిన పనులకు ఎంబీలు చేసి పంపించామని ప్రభుత్వం నిధులు విడుదల చేయాల్సి ఉందని తెలిపారు.

రూ.5లక్షల బిల్లు రావాల్సి ఉంది



పాఠశాల చైర్మన్‌గా మా ఊరి బడిని బాగు చేయాలనే ఉద్దేశంతో తరగతి నిర్మాణ పనులు చేపట్టాను. ఈ గదుల నిర్మాణానికి సంబంధించి రెండేళ్లుగా బిల్లులు రావడం లేదు. చేసిన పనులకు వారంలోనే బిల్లులు ఇస్తామని చెప్పడంతో అప్పు చేసి పనులు చేపట్టా. రూ.5లక్షల బిల్లు రావాల్సి ఉంది. పలుమార్లు ఉన్నతాధికారులను కలిసినా ఫలితం లేదు.

– దోటి శంకర్, మాజీ ఎస్‌ఎంసీ చైర్మన్, చామలేడు

రూ.10లక్షల అప్పు చేశా



కట్టవారిగూడెం ప్రాథమిక పాఠశాలలో భవన నిర్మాణం, ఇతర మౌలిక సదుపాయాలకు రూ.10లక్షలు ఖర్చు చేశా. స్లాబ్ వేయడం, మరుగుదొడ్లు, తాగునీటి పనులు చేశా. బిల్లులు రాకపోవడంతో అప్పుకు వడ్డీ చెల్లించాల్సి రావడంతో రెండేళ్ల అసలంత వడ్డీ అయ్యింది. చేసిన పనుల వరకైనా బిల్లు చెల్లించాలి.

– చాడ చక్రవర్తి, మాజీ సర్పంచ్, కట్టవారిగూడెం

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్

మిర్యాలగూడ : రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ పిలుపునిచ్చారు. మిర్యాలగూడ మండలంలోని యాద్గార్‌పల్లిలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న పార్టీ నియోజకవర్గ స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు మంగళవారం ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమంలో ఆయన మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డితో కలిసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడంలో విఫలమైందని, ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు సూచించినా ప్రభుత్వ కాలయాపన చేస్తుందని ఆరోపించారు. గ్రామంలో సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయాలని, ప్రజా సమస్యలపై పోరాటాలను నిర్వహించాలని సూచించారు. కార్యకర్తలకు చైతన్యం తీసుకొచ్చేందుకు ఇలాంటి శిక్షణ తరగతులు ఉపయోగపడతాయన్నారు. ఈ శిక్షణ తరగతులకు ప్రిన్సిపాల్‌గా పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు వ్యవహరించగా పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, జిల్లా నాయకులు రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, బావండ్ల పాండు, శశిధర్‌రెడ్డి, వినోద్‌నాయక్, సీతారాములు, వరలక్ష్మి, పరశురాములు, రొండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి రూ.48.66లక్షల ఆదాయం

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని కల్లేపల్లి గ్రామంలో కొలువై ఉన్న శ్రీబంగారు మైసమ్మ తల్లి ఆలయం వద్ద సంవత్సరం కాలపరిమితికి గాను వివిధ విక్రయాలు చేపట్టుకునేందుకు మిర్యాలగూడ డివిజన్ పరిశీలకుడు పి.ఏడుకొండలు సమక్షంలో మంగళవారం నిర్వహించిన బహిరంగ వేలంలో ఆలయానికి రూ.48.66లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ గుజ్జుల కొండారెడ్డి తెలిపారు. కొబ్బరికాయలు అమ్ముకునే హక్కును కల్లేపల్లి గ్రామానికి చెందిన మాలోతు వినోద్‌కుమార్ రూ.17.30లక్షలకు, దున్నపోతులు సేకరించుకునే హక్కును ధీరావత్ వాగ్యా రూ.19.30లక్షలు, లడ్డు ప్రసాదం అమ్ముకునేందుకు ధీరావత్ నెహ్రూనాయక్ రూ.5.75లక్షలకు, తలనీలాలు సేకరించుకునేందుకు త్రిపురారం గ్రామానికి చెందిన ఎ.చంద్రశేఖర్ రూ.2.20లక్షలకు, కొబ్బరి చిప్పలు సేకరించుకునేందుకు మాలోతు జనార్దన్ రూ.2.10లక్షలు, పూలదండలు అమ్ముకునే హక్కును కల్లేపల్లికి చెందిన మాలోతు నెహ్రూనాయక్ రూ.2.01లక్షలకు దక్కించుకున్నట్లు తెలిపారు. వేలం సందర్భంగా ఆలయం వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ధీరావత్ దస్రునాయక్, సభ్యులు మాలునాయక్, మాజీ సర్పంచ్ మాలోతు జనార్దన్‌నాయక్, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ పాచ్యనాయక్, ఆలయ పూజారులు ధీరావత్ వెంకటేశ్వర్లు, రామ్మోహన్, కోటేష్, రవినాయక్, నెహ్రూనాయక్, ఎర్రనాయక్, లింగానాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మేలు జాతి పశుసంపద వృద్ధే లక్ష్యం



సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా అధికారి రమేష్

దేవరకొండ : గ్రామీణ ప్రాంతాలలో మేలు జాతి పశు సంపద వృద్ధే లక్ష్యంగా సిబ్బంది పనిచేయాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి జీవీ.రమేష్ అన్నారు. మంగళవారం మండలంలోని తెలుగుపల్లి ప్రాథమిక పశు వైద్యకేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు జీవనాధారంగా ఉపాధి కల్పించడమే కాకుండా ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి అత్యంత కీలకంగా పాడి పరిశ్రమ విస్తరిస్తుందన్నారు. రైతులను క్షీర విప్లవం ద్వారా పాల దిగుబడి వృద్ధిలో భాగస్వాములు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రఫీ, రేణుక, నాగయ్య, శ్రీజ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఫోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మిర్యాలగూడ టౌన్ : బాలికలు ఫోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా బాలల పరిరక్షణ విభాగం సభ్యులు రమణి, ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ అధికారి స్రవంతి అన్నారు. మంగళవారం మండలంలోని అవంతిపురంలో గల తెలంగాణ గిరిజన బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జరిగిన ‘బాలికల చట్టాలు– సమస్యలు’, వ్యక్తిగత పరిశుభ్రతపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ముందుగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ సరిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక, స్టాఫ్ ఆశ్రిత, ఎన్‌జీవోస్ కవిత, ప్రేమలత, అంగన్‌వాడీ టీచర్లు , ఆశావర్కర్, కిశోరబాలికలు తదితరులున్నారు.

అంటువ్యాధులపై అప్రమత్తత అవసరం



పెద్దవూరలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఉమాదేవి

పెద్దవూర : వర్షాకాలం దృష్ట్యా పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అంటువ్యాధుల పట్ల అప్రమత్తత అవసరమని ఎంపీడీఓ ఉమాదేవి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని సూచించారు. పాఠశాల పరిసరాలను, మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇంకుడు గుంతలు, న్యూట్రీషన్ గార్డెన్‌లు అవసరం ఉన్న వాళ్లు బుధవారం వరకు సమాచారం అందించాలన్నారు. సమావేశంలో ఎంఈఓ తరి రాములు, ఎంఎస్‌ఓ శేషు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు ఝాన్సీ, శ్రీనివాస్, సుదర్శన్ పాల్గొన్నారు.

హాలియా : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు చేర్పించడానికి గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని త్రిపురారం ఎంపీడీఓ విజయకుమారి అన్నారు. మంగళవారం త్రిపురారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు పాఠశాలల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. న్యూట్రీగార్డెన్స్, శానిటైజేషన్ కాంప్లెక్స్‌తో పాటుగా పాఠశాలల ఖాళీ స్థలాల్లో కనీసం 100మొక్కలు నాటే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. భవిత కేంద్రాల్లో ఫిజియోథెరపీతో పాటుగా బోధన చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ రమావత్ రవి, ఏపీఓ శ్యామల, ఏపీఎం అశోక్‌కుమార్, కాంప్లెక్స్ హెచ్‌ఎం ఉమ్మడి సైదిరెడ్డి, రవి, బాబు, వెంకటేశ్వర్లు, వరమ్మ, సక్కునాయక్, హనుమానాయక్, అశోక్, రమణమ్మ, లత, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

రైతులకు సేవ చేయడం సంతోషాన్నిచ్చింది



శ్రీనివాసరావును సన్మానిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

హాలియా : కేవీకే శాస్త్రవేత్తగా పంటల సాగులో రైతులకు సేవ చేయడం సంతోషాన్నిచ్చిందని కంపాసాగర్ కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీనివాసరావు అన్నారు. ఆయన హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో గల ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయానికి బదిలీ అయ్యారు. దీంతో మంగళవారం త్రిపురారం మండల పరిధిలోని కేవీకేలో శాస్త్రవేత్తలు ఆయన వీడ్కోలు సమావేశం నిర్వహించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వరి పరిశోధనా స్థానం హెడ్ డాక్టర్ లింగయ్య, సేద్యపు విభాగం శాస్త్రవేత్త చంద్రశేఖర్, ఉద్యానవన శాస్త్రవేత్త హిమబిందు, యంగ్ ప్రొఫెషనల్స్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు భరోసా నిధులతో రైతుల కళ్లలో ఆనందం



దేవరకొండ : చింతపల్లి రైతువేదిక వద్ద మిఠాయిలు పంచుకుంటున్న నాయకులు



మిర్యాలగూడ : సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షిస్తున్న రైతులు, నాయకులు

మిర్యాలగూడ : రాష్ట్ర వ్యాప్తంగా రైతు భరోసా నిధులు విడుదల చేయడంతో రైతుల కళ్లలో ఆనందం నెలకొందని కాంగ్రెస్ కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి అన్నారు. మంగళవారం మిర్యాలగూడ రైతు వేదికలో రైతులతో నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొని ఆయన మాట్లాడారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందన్నారు. కార్యక్మరంలో తలకొప్పుల సైదులు, బసవయ్య గౌడ్, లింగయ్యయాదవ్, వెంకటయ్య అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసాపై నాయకుల సంబరాలు

దేవరకొండ : ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తొమ్మిది రోజుల్లోనే తొమ్మిది వేల కోట్ల రూపాయలను రైతు భరోసా కింద రైతుల ఖాతాలో జమ చేసినందుకు గాను మంగళవారం చింతపల్లి మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భాంగా బాణసంచా పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణం, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ముచ్చర్ల యాదగిరి, మాజీ ఎంపీపీ కొండూరు భవానీ పవన్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు రహీం, దాసరి రాజు, మాజీ కోఆప్షన్ రియాజ్, పోలే రాములు, కురుమేటి కృష్ణయ్య, గజ్జల వెంకటరెడ్డి, బండ్ల నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులతో సీఎం వీడియో కాన్ఫరెన్స్

అడవిదేవులపల్లి : మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌ను రైతులు వీక్షించారు. ప్రభుత్వం 9రోజుల్లో రూ.9వేల కోట్లు రైతు భరోసా కింద రైతుల ఖాతాల్లో జమ చేశామని సీఎం వివరించారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ రాగ్యానాయక్, ఎంపీడీఓ మాతంగి రమేష్, మండల వ్యవసాయ శాఖ అధికారి గుర్రం సరిత, ఏఈవోలు లావణ్య, నరేష్, రైతులు తదితరులున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

మిర్యాలగూడ : రైతులకు 9రోజుల్లో రూ.9వేల కోట్ల రైతు భరోసా నిధులను ఖాతాల్లో జమ చేయడం పట్ల మంగళవారం వేములపల్లి మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి రైతులు, నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాలి కాంతారెడ్డి మాట్లాడారు. రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

...ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోని రైతులు ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌రావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పుట్టల కృపయ్య, రావు ఎల్లారెడ్డి, పుట్టల పెదవెంకటేశ్వర్లు, తంగెళ్ల సత్తిరెడ్డి, రేగట్టె రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పిల్లల సందీప్, చల్లబొట్ల శ్రీనివాస్‌రెడ్డి, హాజీ, బొంగర్ల గిరి, వినోద్, రమేష్, నరేష్, సురేందర్, ఏఈఓ నితిన్ పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో మండల రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి సీఎం ప్రసంగించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల వేణుధర్‌రెడ్డి, ఏఓ జానకిరాములు, సీఈఓ తిరుపతిరెడ్డి, నాయకులు అబ్బనబోయిన శ్రీనివాస్‌యాదవ్, గిరిజన సంఘం మండల అధ్యక్షుడు లాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి

నిడమనూరు : రైతు భరోసా పథకంతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కృషిచేస్తుందని మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం, తహసీల్దార్ జంగాల కృష్ణయ్య అన్నారు. మంగళవారం నిడమనూరు, ఊట్కూర్, ఇండ్లకోటయ్యగూడెం(తుమ్మడం) రైతు వేదికల్లో రైతు భరోసా సంబరాలను నిర్వహించి, ముఖ్యమంత్రి, మంత్రుల సందేశాలను వినిపించారు. ఈ సందర్భంగా చైర్మన్ సత్యం మాట్లాడారు. మండలంలో రైతుభరోసా, సన్నధాన్యానికి బోనస్ అందిస్తూ రైతు సంక్షేమ ప్రభుత్వంగా కాంగ్రెస్ నిలిచిందన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు విజయచంద్ర, క్రాంతి, కాంగ్రెస్ నాయకులు కొండా శ్రీనివాస్‌రెడ్డి, ఉన్నం సత్యనారాయణ, ముంగి శివమారయ్య, పోలె రవి, అభ్యుదయ రైతులు జైపాల్‌రెడ్డి, బైరెడ్డి వెంకట్‌రెడ్డి, జాషువా, వెంకటేశ్వర్‌రావు, ఊట్కూర్‌లో నర్సింగ్ విజయ్‌కుమార్, చర్క శ్రీను రైతులు పాల్గొన్నారు.

రైతు నేస్తం కార్యక్రమానికి తరలిన రైతులు



రైతు నేస్తం కార్యక్రమానికి వెళ్తున్న బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : ప్రభుత్వం తొమ్మిది రోజుల్లో రూ.9వేల కోట్లను రైతు భరోసా పథకం కింద రైతులకు పెట్టుబడి సాయం అందించిన సందర్భంగా హైదరాబాద్‌లోని సచివాలయం సమీపంలో నిర్వహిస్తున్న రైతు నేస్తం కార్యక్రమానికి మిర్యాలగూడ నుంచి రైతులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా రైతులు వెళ్తున్న బస్సులను ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతు పెట్టుబడి సాయంగా రూ.9వేల కోట్లను అందించి రైతుల పక్షపాతిగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

యువత మత్తు పదార్థాల బారినపడొద్దు



పెద్దవూరలో మాట్లాడుతున్న ఎస్‌ఐ ప్రసాద్

మిర్యాలగూడ : యువత మత్తు పదార్థాల బారిన పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని వాడపల్లి ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. డ్రగ్స్ వ్యతిరేక అవగాహన వారోత్సవాల్లో భాగంగా మంగళవారం దామరచర్ల మండలంలోని బొత్తలపాలెం ఆదర్శ పాఠశాలలోని విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యువత డ్రగ్స్, మత్తు పదార్థాలకు అలవాటుపడితే జీవితాలు చెదిరిపోతాయని, కౌమార దశ నుంచే మద్యం మత్తుకు దూరంగా ఉండి క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. ఉపాధ్యాయుల సూచనలు పాటించి జీవితాల్లో సంపూర్ణ ఆరోగ్యం కలిగిన పౌరుడిగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ బాలాజీనాయక్, ప్రిన్సిపాల్ నరహరి, ఉపాధ్యాయులు బాబ్లా, అయాజ్‌ఖాన్ ఉన్నారు.

మత్తుకు అలవాటు పడితే జీవితం అంధకారం

పెద్దవూర : మత్తుకు అలవాటు పడితే జీవితం అంధకారం అవుతుందని ఎస్‌ఐ వై.ప్రసాద్ అన్నారు. మిషన్ పరివర్తన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని ఎస్టీ గురుకుల కళాశాలలో విద్యార్థులకు యాంటీ డ్రగ్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ చదువుపైనే దృష్టి సారించి అనుకున్న లక్ష్యాలను సాధించాలన్నారు. కార్యక్రమంలో మధుసూదన్, పరశురాం, యాదగిరి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చెడుఅలవాట్లకు బానిసలు కావద్దు

నాగార్జునసాగర్ : యువత చెడు అలవాట్లకు బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్‌ఐ ముత్తయ్య అన్నారు. మంగళవారం స్థానిక బీసీ గురుకుల జూనియర్ కళాశాల విద్యార్థులకు మాదకద్రవ్యాల నివారణపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవికుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో మంగళవారం గర్ల్ చైల్డ్ ఎంపవర్మెంట్ కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై, ఆరోగ్య సంరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ నాగేశ్వర్‌రావు పాల్గొని మాట్లాడారు. విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలను ఏర్పర్చుకొని, క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వరలక్ష్మి బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, శారీరక మార్పులు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల స్పెషల్ ఆఫీసర్ కత్తుల సరళ, కవిత, అనురాధ, శోభ, పద్మప్రియ, లక్ష్మణ్, అనూష, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మిర్యాలగూడ : అక్రమంగా ఇసుక రవాణాకు పాల్పడుతున్న ఓ ట్రాక్టర్‌ను పట్టుకోని కేసు నమోదు చేసినట్లు వేములపల్లి ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం వేములపల్లి మండలంలోని రావులపెంట గ్రామానికి చెందిన పిట్టల ప్రవీణ్ తన ట్రాక్టర్‌తో గ్రామ శివారులోని మూసీ వాగు నుంచి ఇసుకను తరలిస్తుండగా గ్రామశివారులో పట్టుకున్నామన్నారు. ఈ మేరకు ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి ట్రాక్టర్ యజమాని ప్రవీణ్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

సభను విజయవంతం చేయాలి

మిర్యాలగూడ : హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 26న జరిగే సేవాలాల్ సేనా రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని అడవిదేవులపల్లి మాజీ ఎంపీపీ ధనావత్ బాలాజీనాయక్ అన్నారు. మంగళవారం పట్టణంలో మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆయన విడుదల చేసి మాట్లాడారు. ప్రభుత్వం గిరిజనులకు 12శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పి మోసం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రకాశ్‌నాయక్, వీరనాయక్, వినోద్‌నాయక్, దస్రునాయక్, అనిల్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అధిక వడ్డీలతో మోసపోవద్దు

దేవరకొండ : అధిక వడ్డీలు ఆశ చూపి చేసే నేరాలతో ప్రజలు మోసపోవద్దని పెద్దఅడిశర్లపల్లి మండల ఇన్‌చార్జ్ సీఐ రాజు సూచించారు. మంగళవారం మండలంలోని వద్దిపట్లలో ఆయన మాట్లాడారు. అధిక వడ్డీలకు ఆశపడి కష్టపడి సంపాదించుకున్న డబ్బులను కోల్పోవద్దన్నారు. అనంతరం దుగ్యాల మోడల్‌స్కూల్‌లో మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నర్సింహులు, గ్రామస్తులు, పాఠశాల ఉపాధ్యాయులు, గుడిపల్లి పోలీసులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సహకారం అభినందనీయం

మిర్యాలగూడ : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు దాతలు అందించే సహకారం అభినందనీయమని హెచ్‌ఎం గుడిపాటి కోటయ్య అన్నారు. మంగళవారం మండలంలోని జప్తివీరప్పగూడెం పాఠశాలలోని విద్యార్థులకు కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ కస్తూరి శ్రీచరణ్ సహకారంతో ప్లేట్లు, వాటర్‌బాటిళ్లు, నోట్ పుస్తకాలు, పాఠశాలకు జాతీయ నాయకుల చిత్రపటాలను బహూకరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దామోదర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, మాధవి, శ్రీనివాస్‌రెడ్డి, జలరాం, చంద్రకళ, సీతారాములు, రవికుమార్, రేణుక తదితరులు పాల్గొన్నారు.

నోట్‌పుస్తకాల పంపిణీ

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని ఎస్సీ బాలికల హాస్టల్‌లో మంగళవారం ఎఎస్‌డబ్ల్యూఓ వెంకటకృష్ణ విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం హాస్టళ్లు, ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పిస్తున్నందున విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు వెళ్లాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా అన్ని హాస్టళ్లల్లో మెనూను పూర్తిస్థాయిలో అమలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వార్డెన్లు సావిత్రి, లక్ష్మణ్, వెంకటేశ్వర్లు, నూస్రత్‌అలీ, కవిత, జానీ, పార్వతి, సీత ఉన్నారు.

రుద్రారం పాఠశాల ప్రారంభం

మిర్యాలగూడ : మండలంలోని రుద్రారం ప్రాథమిక పాఠశాలను పది మంది విద్యార్థులతో మంగళవారం ఎంఈఓ బాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రెండు సంవత్సరాలుగా ఈ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఒక ఉపాధ్యాయుడిని కేటాయించినట్లు, మధ్యాహ్న భోజన ఏజెన్సీని నియమించామని, అన్ని మౌలిక వసతులు కల్పించామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు వేణుధర్ పాల్గొన్నారు.